## టీఎస్ - సెట్ మెంబర్ సెక్రెటరీగా ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి


ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 4 : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లెక్చరర్ షిప్ అర్హత సాధించేందుకు నిర్వహించే తెలంగాణ స్టేట్ – స్టేట్ లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ – సెట్) మెంబర్ సెక్రెటరీగా ప్రొఫెసర్ జి.నరేశ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి గతంలో సెట్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## బొటానికల్ గార్డెన్‌లో వేసవి శిబిరం

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 4 : కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో ఈ నెల 6 నుంచి ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు టీఎస్ఎఫ్‌డీసీ (తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ) ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ప్రతి శనివారం ఈ క్యాంపు ఉంటుందన్నారు. ఏప్రిల్ 6, 13, 20, 27, మే 4, 11, 18, 25, 31 తేదీల్లో ఈ శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఇందులో అన్ని వయస్సుల వారు పాల్గొనవచ్చని, ఎవరికైనా రూ.1200 ప్రవేశ రుసుము ఉంటుందని తెలిపారు. ఇందులో ఔత్సాహికులు ఎవరైనా పాల్గొనవచ్చని అన్నారు. శిబిరంలో భాగంగా బొటానికల్ గార్డెన్‌లో ఉన్న మొక్కలు, చెట్ల గురించి వివరంగా తెలుసుకోవచ్చని, అలాగే స్నాక్స్, భోజన వసతి కూడా కల్పించనున్నట్లు వివరించారు. జిప్‌లైన్, స్కై సైక్లింగ్, ఆర్చరీ, హై రోప్ వంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనవచ్చని, అలాగే గోల్ఫ్ కార్ట్ వాహనాలలో సంచరిస్తూ 50 థీమ్ పార్కులను చూడవచ్చని అన్నారు. దీంతోపాటు పర్యావరణ పరిరక్షణ, అడవుల గురించి అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9493549399, 9346364583 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

## ఎస్‌ఐసీఏ ఆధ్వర్యంలో సాంస్కృతిక వేడుకలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ) : సౌత్ ఇండియా కల్చరల్ అసోసియేషన్(ఎస్‌ఐసీఏ) ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. డా.రాధాచక్రవర్తి స్మారక సాంస్కృతిక వేడుకల్లో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులతో ఏర్పాటు చేసిన కర్ణాటక సంగీత కచేరి ఎంతగానో ఆకట్టుకున్నది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ రెబెల్లా, గోపాలకృష్ణ, సుజాత రావు, డా.హేమ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. నిషా రాజగోపాలన్ సారథ్యంలో నిర్వహించిన కచేరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## కార్పొరేట్ కాలేజీలపై ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు



ఎల్బీనగర్ , ఏప్రిల్ 4: ఇంటర్ బోర్డు ప్రకటనకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు భారత జాగృతి రంగారెడ్డి జిల్లా విద్యార్థి విభాగం నాయకుడు మునుకుంట్ల నవీన్‌కుమార్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఇంటర్ బోర్డు వారు ఇంటర్ పరీక్షలు ముగిశాక మే 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించినప్పటికీ కార్పొరేట్ కాలేజీలు తమ ఫీజుల దాహంతో ఇష్టానుసారంగా తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పరీక్షలు పూర్తయిన ఐదు రోజులకే నారాయణ, శ్రీ చైతన్య కాలేజీలు బ్రిడ్జ్ కోర్సుల పేరుతో ప్రకటనలు జారీ చేయడం శోచనీయమన్నారు. ఈ విషయంలో బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నడుపుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# పైన గంగా.. కింద బెంగ

# కారణం జలగలేనా..?

నెత్తిన జంట జలాశయాలున్నా.. 'బోరు'మనాల్సిందేనా.?
పాతాళ గంగ పైకిరాదాయే.. ప్రభుత్వం పట్టించుకోదాయే..!
అడుగడుగునా బోర్లు.. అంతరించిన భూగర్భ జలాలు
బరితెగించిన అక్రమనీటి వ్యాపారాలు
కంటితుడుపు చర్యలకే రెవెన్యూ యంత్రాంగం
నీటికోసం అల్లాడాల్సిన పరిస్థితులు
ఎడారిని తలపిస్తున్న.. ఆకుపచ్చని గ్రామాలు
కరువు చాయలు దాపురిస్తున్నాయంటున్న
ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామస్తులు

"పక్కన కృష్ణమ్మ ఉన్నా.. ఫలితమేమి లేకపాయే.." అంటూ.. ఓ కవి పాడినట్లు నెత్తిన జంట నగరాలకు తాగునీటిని అందించే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లు ఉన్నప్పటికీ చెంతనే ఉన్న గ్రామాలు తాగు, సాగునీటి కోసం అల్లాడాలిపోవాల్సిన పరిస్థితి దాపురించింది. తిలా పాపం.. తలా పిడికెడు అన్నట్లు.. కొందరు అక్రమ వ్యాపారులు వంద అడుగులకో బోరు బావి.. వెయ్యి అడుగుల లోతు వరకు తవ్వి.. జలగల్లా నీటిని తోడేస్తూ.. వేల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తుండటంతో ఆయా గ్రామాల్లో కరువు చాయలు అలుముకున్నాయి. నిన్నటివరకు పచ్చని పంట పొలాలతో ఆహ్లాదాన్ని పంచిన ఆ గ్రామాలు నేడు ఎడారిని తలపిస్తున్నాయి. ఇది ఎక్కడో అనుకుంటున్నారా..? ఐటీ హంగులతో దినదినం అభివృద్ధి చెందుతున్న ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల పరిస్థితి ఇది. ఈ దుస్థితికి అధికారుల నిర్లక్ష్యం, అవినీతి కారణమంటూ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. అక్రమాలపై చర్యలు తీసుకుంటారో చూద్దాం..! – మణికొండ, ఏప్రిల్ 4

సారూ.. మా ఊరి పాతాళ గంగ.. పాతాలానికి పడిపోతుంది.. అడ్డుకట్ట వేయండంటూ.. ఆ గ్రామస్తులు రెవెన్యూ అధికారులను రెండు మాసాలుగా వేడుకుంటున్నారు. కానీ వారేమో మాకు క్షణం తీరిక లేదన్నట్లుగా ప్రజల సమస్యలను గాలికొదిలేసి.. కలెక్టర్ కార్యాలయంలో పనులున్నాయంటూ తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో ఆకుపచ్చని గ్రామాలు ఇప్పుడు ఎడారిని తలపిస్తున్నాయంటే కారణం ఎవరు? ప్రజల గోసను పట్టించుకోకుండా అంతకన్న మిక్కిలి పనులేమైన ఉన్నాయా.? ఈ రెవెన్యూ అధికారులకు అంటూ ఆ గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాలు ఒకప్పుడు ఆకుపచ్చని గోదావరి గ్రామాలుగా విరాజిల్లేవి. క్రమేణ భూముల ధరలు పెరగడంతో ఇక్కడ వ్యవసాయాన్ని తగ్గించిన అన్నదాతలు భూములను ప్రైవేటు వ్యక్తులకు వివిధ రకాల వ్యాపార కేంద్రాలకు లీజులకు అప్పగించారు. దీంతో చాలా భూముల్లో మార్బుల్స్ దుకాణాలు, ఆట ప్రాంగణాలుగా మారాయి. ఇదిలావుండగా మిగిలిన కొంతమంది వ్యవసాయాన్ని మానేసి అక్రమనీటి వ్యాపారస్తులకు తమ భూములను లీజులకు అప్పగించడంతో గత ఏడాదికాలంగా ఈ ప్రాంతంలో నీటి వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి రోజూ ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల పరిధి నుంచి సుమారు రెండుకోట్ల లీటర్ల నీటిని ట్యాంకర్ల ద్వారా తోడేస్తున్నారు. ఫలితంగా ఆకుపచ్చని గ్రామాలు ఇప్పుడు ఏడారిని తలపించేలా మారాయి. ప్రతి వంద అడుగుల దూరంలో ఒక్కబోరుబావిని తవ్వి అక్కడి నుంచి రాత్రింబవళ్లు నీటిని తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు. తమ గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయంటూ స్థానిక ప్రజలు అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యంగానే మారింది.

### వెయ్యి అడుగుల లోతుకు భూగర్భ జలాలు

సాగు నీటి సమస్యలు దేవుడెరుగు. కనీసం తాగునీటి కోసం భూగర్భ జలాలను కాపాడాలంటూ విన్నవిస్తే చుట్టుపుచూపుగా రెవెన్యూ సిబ్బంది వచ్చి కంటి తడుపు చర్యలు తీసుకోవడంతో నీటి వ్యాపారస్తులు బరితెగించి నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. క్రమేణ ప్రస్తుతం ఖానాపూర్, వట్టినాగులపల్లి గ్రామాల్లో వెయ్యి అడుగుల లోతుకు నీటి నిల్వలు చేరుకోవడం గమనార్హం. సకాలంలో రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ నీటి వ్యాపారాలను అరికట్టి ఉంటే మా ఊర్లు ఇలా కరువును తలపించేవిగా మారేవి కావంటూ ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



### ఈ కరువుకు బాధ్యులెవరు?

ఖానాపూర్, వట్టినాగులపల్లిలో గత నెలరోజులుగా తాగునీటి సమస్యలు తీవ్రతరంగా మారాయి. అక్రమ నీటి వ్యాపారాలతో గ్రామాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. అయినా నీటి వ్యాపారాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రెవెన్యూ అధికారులపై రెండు గ్రామాల ప్రజలు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆకుపచ్చని గ్రామాల్లో చోటుచేసుకున్న కరువుకు బాధ్యులెవరు.? రెవెన్యూ అధికారుల అక్రమవసూళ్లా.. లేక నిర్లక్ష్యపు ధోరణియా.? అని ప్రశ్నిస్తున్నారు. అంటున్నారు. ఎప్పుడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే పనులున్నాయంటూ వెళ్లే అధికారులకు అక్కడేం పని.. అక్కడే విధులు నిర్వహించుకోవచ్చు కదా.. అంటూ ప్రజలు మండిపడుతున్నారు. స్థానిక సమస్యలపై స్పందించని అధికారులు మాకెందుకని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమనీటి వ్యాపారాలపై చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగర శివారులోని వట్టినాగులపల్లి గ్రామంలో నీరు లేక ఎండిపోయిన వరిపంట

### ధ్వంసమవుతున్న మున్సిపల్ రోడ్లు, పైపులైన్లు

అక్రమ నీటి వ్యాపారం ద్వారా మున్సిపాలిటీ నిధులతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రజల నిధులతో నిర్మించిన ఈ రోడ్ల పరిరక్షణ బాధ్యత మున్సిపల్ శాఖ అధికారులకు ఉన్నప్పటికీ నీటి వ్యాపారాల నియంత్రణ విషయంలో తమకెలాంటి అధికారాలు లేవంటూ ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన రహదారులు పాడై పోతుంటే పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### వ్యవసాయ బావులకు కనెక్షన్లు.. నీటి దందా

వ్యవసాయం చేసుకునేందుకు ఏజీఎల్ కనెక్షన్ ద్వారా విద్యుత్‌ను అందించాల్సి ఉంటుంది. కానీ ఇవే కనెక్షన్లను పెట్టి యథేచ్ఛగా నీటి వ్యాపారాలు చేస్తున్నారు. అయినా ఆ శాఖ అధికారులకు పట్టింపే లేదు. విద్యుత్ మీటర్ల మంజూరులో కమర్షియల్‌గా కేటాయింపులు చేపట్టాలి కానీ ఏనాడు ఆశాఖ అధికారులు పర్యటించి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రజల సొమ్ముతో ఏర్పాటు చేసిన రహదారులు, అక్రమ విద్యుత్ వినియోగంతో పాటు ప్రకృతి అందించే భూగర్భ జలాలను విచ్ఛిన్నం చేస్తున్న అక్రమనీటి వ్యాపారస్తులపై ఇప్పటి వరకు ఏ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించలేదంటే వ్యాపారాలు ఏస్థాయిలో కొనసాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.


ఖానాపూర్–వట్టినాగులపల్లి వెళ్లే రహదారి పక్కనే బోరు ద్వారా ట్యాంకర్లలో నీరు నింపుతున్న దృశ్యం

# నొ మెక్కుడు..

## ఈ-పాస్ మాయాజాలం!

రేషన్ దుకాణాల్లో డీలర్ల నయా దందా
ఒకే యంత్రం.. వేర్వేరు షాపుల్లో వినియోగం
ప్రభుత్వం ఇస్తున్న కమీషన్‌తోపాటు
బియ్యాన్ని కాజేస్తున్న డీలర్లు
జిల్లాలో ప్రతి నెలా 5.58లక్షల కార్డులకు
11,562 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ
ఇందులో 30శాతం బియ్యం పక్కదారే!
అధికారుల పర్యవేక్షణ కొరవడడమే కారణం



రంగారెడ్డి, ఏప్రిల్ 4(నమస్తే తెలంగాణ)/ వనస్థలిపురం : ఇప్పటి వరకు బోగస్ కార్డులతో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించడాన్ని చూశాం. అలాగే.. బినామీ డీలర్లతో బియ్యం పంపిణీలో జరుగుతున్న మోసాలను విన్నాం. కానీ.. పారదర్శకతకు నిదర్శనంగా చెప్పుకుంటున్న ఈ–పాస్ యంత్రాలతోనే డీలర్లు జిల్లాలో నడిపిస్తు నయా దందా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఎక్కడి నుంచి అయినా సరుకులు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వం కల్పించిన 'పోర్టబిలిటీ' విధానమే ఈ అక్రమాలకు ఊతమిస్తున్నది. కొద్దిరోజుల కిందట ఒక దుకాణానికి సంబంధించిన ఈ పాస్ యంత్రం మరో దుకాణంలో దర్శనమివ్వడంతో ఆరా తీసిన సివిల్ సప్లయ్ అధికారులకు డీలర్ల నయా దందా బయటపడింది. దీంతో ఈ తరహాలో జిల్లాలో ఎక్కడెక్కడ దందా నడుస్తుందన్న దానిపై అధికారులు ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో మొత్తం 5.58లక్షల రేషన్ కార్డులకు ప్రతి నెలా 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. అయితే ఇందులో 30 శాతం బియ్యం వివిధ రూపాల్లో పక్కదారి పడుతున్నట్లు తెలుస్తున్నది. రేషన్ దుకాణాల్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడం వల్లనే బియ్యం దందాకు అడ్డుకట్ట పడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### వెలుగులోకి సరికొత్త దందా..

వనస్థలిపురంలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయంటూ కొద్దిరోజుల కిందట సివిల్ సప్లయ్ అధికారులకు అందిన సమాచారం మేరకు అధికారులు అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. మాడ్గుల మండలంలోని ఓ రేషన్ దుకాణానికి సంబంధించిన ఈ–పాస్ యంత్రం ఉండడాన్ని అధికారులు గుర్తించారు. వనస్థలిపురంతోపాటు మాడ్గుల మండలంలోని రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న సరుకులను, పంపిణీ చేసిన బియ్యం లెక్కలను అధికారులు పరిశీలించారు. లెక్కల్లో ఎక్కడా తేడా లేదని అధికారులు చెబుతున్నారు. దీనిపై విచారణ చేస్తున్నామని అంటున్నారు. అయితే మాడ్గుల మండలంలోని దుకాణానికి సంబంధించిన మిషన్ వనస్థలిపురంలో ప్రత్యక్షం కావడం మాత్రం మిస్టరీగా మారింది. చార్జింగ్ కోసమే మిషన్‌ను అక్కడ పెట్టినట్లు మాడ్గుల మండల డీలర్ చెప్పి తాత్కాలికంగా తప్పించుకున్నప్పటికీ.. ఈ ఘటన రేషన్ డీలర్ల నయా దందాను మాత్రం తేటతెల్లం చేసింది. జిల్లాలో జరుగుతున్న ఈ తరహా అక్రమాలపై లోతుగా విశ్లేషించే పనిలో సివిల్ సప్లయ్ అధికారులు నిమగ్నమైనట్లు తెలుస్తున్నది.

### ఇదీ దందా జరుగుతున్న తీరు..

రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ–పాస్ యంత్రాన్ని అమలులోకి తెచ్చి బయోమెట్రిక్ విధానంలో బియ్యాన్ని కార్డుదారులకు అందజేస్తున్నారు. అలాగే.. ఎక్కడి నుంచి అయినా రేషన్ బియ్యాన్ని తీసుకునేలా ప్రభుత్వం 'పోర్టబిలిటీ' విధానాన్ని తెచ్చింది. రేషన్ బియ్యాన్ని పూర్తి ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వం బియ్యం పంపిణీని చేసినందుకు డీలర్లకు క్వింటాలుకు రూ.140 లెక్కన చెల్లిస్తున్నది. ఉద్యోగ, ఉపాధి రీత్యా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు రంగారెడ్డి జిల్లాలో అధికంగా ఉండడంతో జిల్లాలో పోర్టబిలిటీ విధానం సక్సెస్‌ఫుల్‌గా సాగుతున్నది. ఇదే డీలర్లకు వరంలా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ తీసుకునే వారు తక్కువగా ఉండడంతో చాలా మంది డీలర్లు పట్టణ ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో అక్కడి ఈ–పాస్ యంత్రాలను ఉంచి బియ్యం పంపిణీని జరుపుతున్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి కమీషన్ రూపంలో వస్తున్న డబ్బులను అక్రమంగా పొందుతున్నారు. ఇది మొదటి విడత జరిగే వ్యవహారం. ఇక రెండోది.. కార్డుదారుల వేలి ముద్రలు వేశాక.. తూకంలో బియ్యం వేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి డీలర్లు డబ్బులు చెల్లిస్తున్నారు. ఆ బియ్యాన్ని దొడ్డిదారిన విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక్కో క్వింటాలుపై రూ.400–రూ.500 వరకు డీలర్లు అక్రమంగా సంపాదిస్తున్నట్లు తెలిసింది. ఈ–పాస్ యంత్రం మాటున జిల్లాలో రూ.కోట్లలో అక్రమ దందా సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఒక దుకాణంలోని బియ్యాన్ని మరో దుకాణానికి సర్దుబాటు చేస్తూ అక్రమాలను కప్పిపుచ్చుతుండగా.. సివిల్ సప్లయ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకనే జిల్లాలో నయా దందా సాగుతున్నదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

### విచారణ చేస్తున్నాం

వనస్థలిపురం రేషన్ దుకాణంలో మాడ్గుల మండలానికి సంబంధించిన ఈ–పాస్ యంత్రం ఉండడంపై విచారణ జరుపుతున్నాం. రెండు చోట్ల దుకాణాల్లో ఫిజికల్ వెరిఫికేషన్ చేశాం. స్టాక్, బియ్యం పంపిణీలో వ్యత్యాసం లేదని గుర్తించాం. ఈ–పాస్ యంత్రాలతో డీలర్లు చేస్తున్న కొత్త తరహా మోసాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

– సరోజ, ఏఎస్‌వో, పౌర సరఫరాల శాఖ, రంగారెడ్డి జిల్లా

### ప్రతి నెలా 30 శాతం బియ్యం పక్కదారి

జిల్లాలో అంత్యోదయ, ఆహార భద్రత, అన్నపూర్ణ ఆహార భద్రత కార్డులు మొత్తం 5,58,438 వరకు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం నెలనెలా 11,562.725మెట్రిక్ టన్నుల బియ్యాన్ని జిల్లాలోని 932 చౌకధరల దుకాణాలకు కేటాయిస్తున్నది. ఇందుకుగాను ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.39.35పై. వరకు ఖర్చు చేస్తున్నది. పేదల కోసం పంపిణీ చేస్తున్న బియ్యం అక్రమార్కుల జేబులు నింపుతున్నది. ప్రభుత్వం కేటాయిస్తున్న బియ్యంలో సుమారు 30శాతం బియ్యం పక్కదారి పడుతున్నట్లు తెలుస్తున్నది. పట్టణాలు, గ్రామాల్లో దళారులను పెట్టుకుని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ కొందరు వ్యాపారులు దందా సాగిస్తున్నారు. కొన్నిచోట్ల రేషన్ డీలర్లే నేరుగా కార్డుదారుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని మిల్లుల్లో పాలిష్ చేయించి సన్న రకం బియ్యంలో కలుపుతుండగా.. కొందరు మిల్లర్లు సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన రేషన్ బియ్యం చాలా వరకు సరిహద్దులు దాటుతున్నది. ఔటర్ మీదుగా నేరుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈకేవైసీని అమలు చేస్తున్నది. అలాగే.. బినామీ డీలర్లకు లాగిన్ సౌకర్యాన్ని సైతం తొలగించింది. అడపాదడపగా 6ఏ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ జిల్లాలో బియ్యం అక్రమ దందాకు మాత్రం తెరపడడం లేదు.

## పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు..

# ఏప్రిల్ 15 వరకే గడువు




సిటీబ్యూరో, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : భారత ఎన్నికల సంఘం గుర్తించిన అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురుశెట్టి అన్నారు. అత్యవసర సర్వీస్ శాఖ నోడల్ అధికారులతో పోస్టల్ బ్యాలెట్‌పై జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం పన్వర్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. అత్యవసర సర్వీస్ శాఖలకు సంబంధించిన శాఖకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఒక నోడల్ అధికారిని నియమించుకొని సంబంధిత వివరాలను అందజేయాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారందరూ ఫారం–12డి పూర్తిగా నింపి దానితో పాటు ఓటరు గుర్తింపు కార్డు జత చేస్తూ సంబంధిత హెడ్ రిటర్నింగ్ అధికారి వద్ద ఈ ఏప్రిల్ 15 తేదీలోగా అందజేయాలని కోరారు.

### మే 3 నుంచి 8 వరకు పోస్టల్ బ్యాలెట్

పోస్టల్ బ్యాలెట్ అందజేసిన వారికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు మే 3 నుంచి 8 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 8వ తేదీ తర్వాత పోస్టల్ బ్యాలెట్ వేస్తానని రిటర్నింగ్ అధికారికి వద్దకు వస్తే సంబంధిత హెడ్‌ను బాధ్యుడిని చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యవసర సేవల ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో కంటోన్మెంట్ జాయింట్ సీఈఓ ఆకాశ్, డీఆర్ఓ వెంకట చారి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి డిప్యూటీ కలెక్టర్ అర్చన, అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

## బిట్స్ ఫిలానీతో సీఆర్‌పీఎఫ్ ఎంఓయూ


ఒప్పంద పత్రాలను అందుకుంటున్న సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా , బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ

జవహర్‌నగర్, ఏప్రిల్ 4: అత్యాధునిక ప్రమాణాలతో కూడిన నైపుణ్య శిక్షణను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఐజీ సదరన్ సెక్టార్‌లో గురువారం దివ్యాంగ్ వారియస్‌కు నైపుణ్య శిక్షణ అందించేందుకు బిట్స్ ఫిలానీ, సీఆర్‌ఫీఎఫ్ మధ్య ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ ఐజీ చారు సిన్హా ఐపీఎస్, బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జి హాజరై ఒప్పంద పత్రంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ మాట్లాడుతూ బిట్స్ ఫిలానీ ఉత్తమ నైపుణ్య శిక్షణకు నాందిగా నిలుస్తుందని, దివ్యాంగ్ వారియర్స్‌కు విలువలతో కూడిన అభ్యాసాలను అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డీఐజీ అనిల్ మింజ్, బిట్స్ ఫిలానీ డీన్ యోగేశ్వరీ, సీఆర్‌పీఎఫ్, బిట్స్ ఫిలానీ సిబ్బంది పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ శిక్షణ

హైదరాబాద్ ఆట ప్రతినిధి, ఏప్రిల్ 4 : హైదరాబాద్ బ్యాడ్మింటన్‌కు హబ్‌గా కొనసాగుతున్న వేళ.. మరింత మంది యువ ప్లేయర్లను వెలుగులోకి తీసుకువచ్చేందుకు గేమ్‌పాయింట్ కూకట్‌పల్లిలో తమ పదో సెంటర్‌ను గురువారం ప్రారంభించింది. ఇప్పటికే నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న స్పోర్ట్స్ సెంటర్లు ప్లేయర్లకు శిక్షణతో పాటు ఫిట్‌నెస్ విషయంలో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు గేమ్‌పాయింట్ సీఈవో ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు.

### ఏటీపీఏ ఆధ్వర్యంలో..

ఎల్బీ స్టేడియం వేదికగా అమెచ్యూర్ తెలంగాణ పికిల్‌బాల్ అసోసియేషన్(ఏటీపీఏ) ఆధ్వర్యంలో పికిల్‌బాల్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు గురువారం జరిగాయి. శాట్స్ ఎండీ లక్ష్మి పికిల్‌బాల్ పోటీలతో పాటు సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీఏ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శాట్స్ డీడీ శ్రీలత, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.